International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.7, Issue-2(1), February, 2020
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# కందుకూరి యుగం – నవలా రచన (1870–1930)

డా॥ ద్వివేది కృష్ణ గాయత్రి
తెలుగు అధ్యాపకురాలు
వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల
కొత్తపేట

సంస్కృతంలో బాణుని కాదంబరి, దండి దశకుమార చరిత్ర మొదలగునవి సుప్రసిద్ధమైన గద్య రచనలు. 'గద్యం కవీనాం నికషం వదన్తి' అని బాణుడు తన కాదంబరితో నిరూపించాడు కూడా. తెలుగు భాషలో సాహిత్య రచన ప్రారంభం అయ్యాక సుమారుగా 800 సంవత్సరాల సంస్కృత రచనలకు అనువాదాలు స్వతంత్ర మార్గంలో తెలుగు మహాకవులు సాగించారు. తెలుగు పద్యం హృద్యమై, రసవత్తరమై మహాకావ్యాలను, నాటకాలను కూడా ప్రబంధ మార్గంలోకి తీసుకొని వచ్చింది. పింగళి సూరన గారి కళాపూర్ణోదయం తొలి తెలుగు కల్పిత రచనగా విమర్శకులు పేర్కొంటారు.

ఆధునిక కాలంలో భారతీయ భాషలలో బెంగాల్‌లో నవలా రచన ప్రప్రథమంగా ప్రారంభం అయింది. తెలుగు సాహిత్య చరిత్రలో క్రీ.శ. 1850 నుంచి ఆధునిక యుగంగా సాహిత్యకారులు పరిగణిస్తారు. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో దేశంలో సంస్కృతిలో, భాషలో అనేక వినూత్న పరిణామాలు చోటు చేసుకుంటున్న సమయమది. సాహిత్యం సంప్రదాయం నుండి విడివడి క్రొత్త పుంతలు త్రొక్కడం ప్రారంభించింది. ఆధునిక కాలంలో వచ్చిన గద్య ప్రబంధాలకు నవల అనే నామకరణాన్ని కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారు చేశారు. "నవాన్ విశేషాన్ లాతీతి నవలా" అని ఆయన పేర్కొన్నారు.

**నవల లక్షణాలు :**

పలువురు విమర్శకులు నవల లక్షణాలను గురించి చర్చించారు. "సమకాలీన జీవిత వాస్తవికత మీద ఆధారపడ్డ కల్పనాత్మక సాహిత్య ప్రక్రియను మనం నవల'గా పేర్కొనవచ్చు. 'వాస్తవిక సమకాలీన జీవిత చిత్రణ, కథాకథన పద్ధతి, కల్పితేతివృత్తము మొదలగుని నవల యొక్క లక్షణాలు" అని ఆచార్య జి. నాగయ్య గారి అభిప్రాయం.

చింతామణి పత్రిక నవలల పోటీ నిర్వహిస్తూ విధించిన నిబంధనలను బట్టి నవలా లక్షణాలను తెలుసుకొనవచ్చును.

"వచన ప్రబంధమనగా కల్పిత కథ. ఆ కథను పురాణేతిహాసాదుల నుండి గాని, చరిత్రల నుండి గాని కథా సారస్యమునకు అనుకూలముగ నుండు లాగున దానికి నూతనాంశములను చేర్చి పెంచి వ్రాయవచ్చును. లేదా కవి మొదటి నుండి కడవరకు స్వబుద్ధి చేతనే నూతన కథను కల్పించియైనను వ్రాయవచ్చును. శృంగారమో, వీరమో యేదో ఒక రసమును ప్రధానముగా జేసికొని వివిధ రస సంయుతముగ నుండునట్లుగాని యాయా రసమును పోషించుటకయి వివిధ కష్ట సుఖములను, ప్రయత్నములను, కార్య విఘాతములను, కార్య సాఫల్యములను మధ్య మధ్య సందర్భోచితముగా తీసికొనవచ్చును. కథయంతయు నొక్కని చరితము వలె నుండునట్లు వ్రాయవలెను.....దుష్కార్యము వలన మొదట కొంత కాలము కార్యసిద్ధి యగునట్లు కనపడినను కడపట కృషి యంతయు విఫలమయి ధర్మమునకే విజయము కలుగుట మొదలైన సంగతులను బలపరిచి వ్రాయవలెను"

తెలుగులో తొలి నవల ఏది? అనే అంశంపై విమర్శకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. క్రీ.శ. 1867లో కొక్కొండ వేంకటరత్నం పంతులుగారు బాణుని కాదంబరిని తెలుగులోకి అనువాదం చేస్తూ మహాశ్వేత అనే నవలను రచించారు. నిడుదవోలు వేంకటరావుగారు దీనినే మొదటి నవలగా పేర్కొన్నారు. అయితే ఇది పూర్తిగా లభ్యము కాలేదు. "మహాశ్వేత నవల అనుట కంటె బాణుని కాదంబరికి స్వేచ్ఛానువాదం అనుట యుక్తము"

అని ఆచార్య జి. నాగయ్యగారు అభిప్రాయపడ్డారు. 1867 ప్రాంతానికే తెలుగులో నవలా రచనకు పలువురు రచయితలు ఆలోచనలు ప్రారంభించారని చెప్పవచ్చు.

1872 లో లార్డు మేయో బెంగాల్ గెజిట్‌లో తెలుగువారి ఆచార వ్యవహారాలను తెలియజేస్తూ రచింపబడే ఉత్తమ నవలకు బహుమతి ఇవ్వబడుతుంది అని ప్రకటన చేయడం చూసి కర్నూలు డిప్యూటీ కలెక్టరుగా ఉన్న నరహరి గోపాలకృష్ణమశెట్టి శ్రీరంగరాజ చరిత్ర రచించారు. దీనికే 'సోనాబాయి పరిణయము' అనే మరో పేరు కూడా ఉంది. ఇది ఫోర్ట్ సెయింట్ జార్జి గెజిట్‌లో నవలగా పేర్కొనబడింది. శ్రీరంగరాజ చరిత్ర తొలి తెలుగు నవల అని మొదలి నాగభూషణశర్మ, బొడ్డపాటి వేంకట కుటుంబరావు అభిప్రాయపడ్డారు. "శ్రీరంగరాజ చరిత్రయందు నవలా లక్షణములుగా పేర్కొనబడిన వాస్తవిక సమకాలీన జీవిత చిత్రణము, కథా కథన పద్ధతి, కల్పితేతివృత్తము కన్పట్టుచున్నవి. అందు పాత్రపోషణ, కథా సంవిధానము ప్రకృష్టముగా లేదు. శ్రీరంగరాజ చరిత్ర తొలి చారిత్రక నవలా ప్రయత్నమని చెప్పవచ్చును" అని ఆచార్య జి. నాగయ్యగారు అభిప్రాయపడ్డారు.

కందుకూరి వీరేశలింగంగారు స్వీయ చరిత్రలో "తొలి తెలుగు వచన ప్రబంధమును నేనే రచియించితిని" అని వ్రాసుకున్నారు. ఈయన వ్రాసిన రాజశేఖర చరిత్ర 1857లో వివేక వర్ధిని పత్రికలో ధారావాహికంగా వచ్చింది. దీనిని విమర్శకులు తొలి తెలుగు సాంఘిక నవల అని అభిప్రాయపడ్డారు. తెలుగులో పంతులుగారే నవలా రచనకి మార్గదర్శకత్వం వహించారని అక్కిరాజు రమాపతిగారు అన్నారు. పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు, ఆర్. యస్. సుదర్శనం, కోడూరి శ్రీరామమూర్తిగార్లు చర్చించి రాజశేఖర చరిత్రనే తొలి తెలుగు నవలగా భావించారు.

"రాజశేఖర చరిత్ర సమకాలీన సమాజములను సమగ్రముగా నిర్దుష్టముగా చిత్రించి నవలా ప్రయోజనమును ఎలుగెత్తి చాటిన స్వతంత్రమైన తొలి సాంఘిక నవల" – ఆచార్య జి. నాగయ్య.

రాజశేఖర చరిత్రలో ఆంగ్లములో గోల్డ్‌స్మిత్ రచించిన వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ యొక్క సహాయముతో కథాకల్పన చేయబడిందని పంతులుగారు పేర్కొన్నారు. కందుకూరివారే తరువాత నవలాకారులందరికీ దారి చూపి నవలా రచనను ప్రోత్సహించారు. రాజశేఖర చరిత్రకు 'వివేక చంద్రిక' అనే మరో పేరు కూడా ఉంది. 1878లో మొదటిసారిగా రాజశేఖర చరిత్ర గ్రంథరూపంలో ప్రచురించబడింది. కందుకూరివారు ఆంగ్లంలో జొనాథన్ స్విఫ్ట్ రచించిన గలివర్స్ ట్రావెల్స్ ఆధారంగా సత్యరాజా పూర్వదేశ యాత్రలను రచించారు. సత్యవతీ చరిత్రము (1883), చంద్రమతీ చరిత్రము (1884) అనే రెండు నవలలు రచించారు. కందుకూరివారి రచనలన్నీ సంఘసంస్కరణాభిలాషతో రచించబడినవే. మొదటి రెండు నవలలు పురుషుల మనఃప్రవృత్తి, తరువాత రెండు నవలలు స్త్రీల మనఃప్రవృత్తులను సంస్కరించే ఉద్దేశ్యంతో రచించారు.

కందుకూరివారి శిష్యవర్గంలో ప్రథమగణ్యులైన శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రామచంద్ర విజయము, హేమలత, అహల్యాబాయి, కర్పూర మంజరి (రెండు భాగములు), గణపతి, దాసీకన్య, సుధాశరచ్చంద్రము, కృష్ణవేణి, మణిమంజరి, రాజరత్నము, విష్ణువర్ధనుడు, విజయలక్ష్మి (అసంపూర్ణం) నవలలను రచించారు. ఈ నవలల యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రధానంగా సంఘసంస్కరణయే.

రామచంద్ర విజయములాంటి నవలలో సమకాలీన సాంఘిక పరిస్థితులు చక్కగా చిత్రించబడ్డాయి. చింతామణి పత్రిక నిర్వహించిన నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన నవల ఇది. "పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణాలు–డబ్బు మహత్తు కారణంగా లండన్ ఎలిమెంట్స్ దండిగ తయారయిన వ్యవస్థను చూస్తాము. ఆనాడు సామాన్య ప్రజలకు లంచగొండి ఉద్యోగుల బెడద బాగా ఉండటం కూడా ప్రతిబింబించింది ఈ నవల" అని సంజీవమ్మ వివరించారు.

"గణపతి తొలి తెలుగు హాస్య నవల. ఈ నవల రెండు భాగములు. మూడు తరముల వారి చరిత్రము వర్ణితము. తమ తమ వృత్తులను సమర్థించుకొను సందర్భమున వారి వారి చర్చలు హాస్యస్ఫోరకములు. గణపతి చేయు పనులు కొన్ని హాస్యము గొల్పుచున్నను, గొన్ని వానిపై అసహ్యమును బుట్టించుచున్నవి. అయినను చదువరులను

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.7, Issue-2(1), February, 2020
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

వెన్నాడు సన్నివేశముల చేత అలరారుచున్నది." చిలకమర్తివారి పేరు చెప్పగానే తెలుగు ప్రజలకు గుర్తొచ్చే నవల గణపతియే. నాటికి, నేటికి హాస్య నవలలలో గణపతిదే ప్రథమ స్థానం. రాజరత్నం కట్న కోరలకు బలైన స్త్రీ. విజయలక్ష్మి అసంపూర్తి నవల. విజయలక్ష్మి మధ్యాహ్న సమయాలలో స్త్రీలందరికీ విద్య నేర్పేది. రాజరత్నం కూడా ఇటువంటి గృహిణియే. చిలకమర్తి నవలలో కొన్ని చారిత్రక నవలలు కొన్ని హాస్య నవలలు, కొన్ని సాంఘిక నవలలు. సుధాశరచ్చంద్రము అనే నవల రమేష్ చంద్రదత్ వ్రాసిన 'లేక్ ఆఫ్ పామ్స్' అనే నవలకు అనువాదము. ఇది కులాంతర వివాహమునకు సంబంధించిన ఇతివృత్తము కలిగినది.

అనంతర నవలా రచయితలలో జాతీయోద్యమ ప్రభావం సమధికంగా కనబడుతుంది. ఈ కాలంలో భారతదేశ చరిత్రకు సంబంధించిన కథలు, ఆయా కాలాలలో ప్రసిద్ధికెక్కిన వీరుల గాథలు ఇతివృత్తాలుగా కలిగిన నవలలు అధికంగా వచ్చాయి. సాంఘిక సంస్కరణాదృష్టితో వచ్చిన నవలలు ముఖ్యంగా హరిజనోద్ధరణ, స్త్రీ విద్య, వర్ణాంతర వివాహాలు మొదలయిన అంశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 1913లో తల్లాప్రగడ సూర్య నారాయణగారు అంటరాని తనాన్ని ఇతివృత్తంగా తీసుకొని 'హేలావతి' అనే నవలను రచించారు. 1918లో వేంకట పార్వతీశ్వర కవులు వర్ణాంతర వివాహం, సహవాసం, సమత అనే అంశాలతో 'మాతృమందిరం' నవలను రచించారు. జాతీయోద్యమ ప్రభావంతో వెలువడిన నవలలలో వేలూరి శివరామశాస్త్రిగారి 'ఓబయ్య', ఉన్నవ లక్ష్మీనారాయణగారు రచించిన 'మాలపల్లి' సామాజిక చైతన్యాన్ని కలిగించిన నవలలు.

ఇంకా 1915-1930 కాలంలో రచించబడిన నవలలో ఖండవల్లి రామచంద్రులుగారి లక్ష్మీసుందరి విజయము, భోగరాజు నారాయణమూర్తిగారి విమలాదేవి, అల్లాహెూ అక్బర్, చంద్రగుప్తుడు, ఆంధ్రరాష్ట్రం, వేలాల సుబ్బారావు గారి రాణి సంయుక్త, కేతవరపు వేంకటశాస్త్రిగారి రాయచూరు యుద్ధము, లిచ్ఛవీ కుమారి, దుగ్గిరాల రామచంద్రయ్య చౌదరిగారి పాతాళభైరవి, జి.వి.యస్. దొరస్వామయ్య గారి కపాలకుండల, ఆనందమఠం, కనకవల్లి భాస్కరరావుగారి ప్రఫుల్లముఖి, చిల్లరిగె శ్రీనివాసరావుగారి కృష్ణకాంతుని మరణశాసనం, చాగంటి శేషయ్యగారి దుర్గేశనందిని, నవాబు నందిని, రాధారాణి, వేంకట పార్వతీశ్వర కవుల రాజసింహ, అక్కిరాజు ఉమాకాంతంగారి టిప్పు సుల్తాను, తెన్నేటి సూరి రెండు మహా నగరాలు, వంగూరి సుబ్బారావుగారి ప్రభాతము, ధరణికోట, చివుకుల పిచ్చయ్యశాస్త్రిగారి పద్మిని మొదలైన నవలలు తెలుగువారి హృదయాలను దోచుకున్నాయి.

ఈ కాలంలోనే బండారు అచ్చమాంబ ఆధునిక తొలి తెలుగు రచయిత్రిగా ప్రసిద్ధి చెందారు. ఈమె 1874లో కృష్ణాజిల్లాలో జన్మించారు. గురజాడ అప్పారావు గారి కంటే ముందు ఈమె రచించిన కథ 'ధనత్రయోదశి' 1902 నవంబరులో హిందూ సుందరి అనే పత్రికలో అచ్చయింది ఇంకా 'అబలా సచ్చరిత్ర' అనే పేరుతో ఈమె ప్రసిద్ధి చెందిన స్త్రీల గాథలను రచించారు. ఈ రెండు రచనలలో సమకాలీన సామాజిక పరిస్థితులు, భారతీయ సంప్రదాయం, ఆచారాలలో దాగి ఉన్న శాస్త్రీయత, వివాహ క్రతువులోని పలు అంశాలకు ఈమె వివరణలు ఇస్తూ రచనలు చేశారు. 2008-2009 లో బెంగుళూరులో జరిగిన 'నేషనల్ హిస్టరీ కాంగ్రెస్'లో ఈమె రచనలను ఆధారంగా చేసుకొని చారిత్రక, సామాజిక పరిస్థితులను విశ్లేషించడంపై చర్చించారు. అబలా సచ్చరిత్రలోని ఇతివృత్తం ప్రధానంగా స్త్రీలకు సంబంధించినదే అయినా, చాలామంది చరిత్ర ఉండడం వలన నవలా లక్షణాలనకు భిన్నమైంది. స్త్రీల జీవిత చరిత్రగా ప్రసిద్ధికెక్కింది. ఈ కోవలోనే కందుకూరివారు ఆంధ్ర కవుల చరిత్ర, చిలకమర్తి వారు మహాపురుషుల చరిత్రలను రచించారు. అయితే వీటిని నవలలుగా పరిగణించడానికి వీలులేదు.

సమకాలీన సాంఘిక సరిస్థితులు, దేశభక్తి, జాతీయోద్యమ ప్రభావం, సంఘసంస్కరణ ఈ కాలంలో వచ్చిన నవలలలో అత్యధికంగా కనబడుతాయి. వీరేశలింగం గారి సంఘసంస్కరణ ధ్యేయం జాతీయోద్యమంలో భాగమై కవులను, రచయితలను ఉత్తేజపరిచి అందరికీ మార్గదర్శకమై నిలిచింది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆచార్య జి. నాగయ్య – తెలుగు సాహిత్య సమీక్ష
2. ఆచార్య వెలమల సిమ్మన్న – తెలుగు సాహిత్య చరిత్ర
3. ఆచార్య ద్వానా శాస్త్రి – తెలుగు సాహిత్య చరిత్ర
4. బొడ్డపాటి కుటుంబరావు – ఆంధ్ర నవలా పరిచయము